క్లుప్తంగా

నేడు తొలి ఏకాదశి పూజలు

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీ హరిహర క్షేత్రంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ పి. నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు ఉంటాయన్నారు. అదే విధంగా ఆంజనేయనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పార్చన పూజ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆల్విన్‌కాలనీ: తొలి ఏకాదశి సందర్భంగా పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ ఆలయంలో ఆదివారం ఉదయం 4.30 గంటలకు సీతారాచంద్ర స్వామి వారికి, ఆంజనేయ స్వామివారికి, గోదా రంగనాధ స్వామి వార్లకు ప్రత్యేక పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు లలితా సహస్ర నామ పారాయణం బృందం వారిచే విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాజీ మంత్రి పరామర్శ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ఉద్యమ నేత జగద్గిరి గుట్ట ప్రాంతానికి చెందిన గుట్ట శంకర్‌ గుప్తా ఇటీవల గుండెకు సంబంధించిన బైపాస్‌ సర్జరీ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌ గౌడ్‌ శనివారం జగద్గిరిగుట్టలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌ రెడ్డి, ఆంజనేయులు, శంకర్‌ గౌడ్‌, అంజిరెడ్డి, వాసు, జయకృష్ణ, అఖిల్‌, నర్సింగ్‌ గౌడ్‌, రవీంద్ర చారి, సోమయ్య గుప్తా, లక్ష్మణ్‌, బాలాచారి, సోమేశ్వర్‌గుప్తా, చంద్రమౌళి, రాము తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కాపు సంఘం ఏకగ్రీవ ఎన్నిక



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూకట్‌పల్లి కాపు సంఘం అధ్యక్షుడిగా భగవాన్‌, ఉపాధ్యక్షులుగా బచ్చు నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఆడ బాల నరేష్‌, కోశాధికారిగా కొత్తపల్లి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా పిల్లా నారాయణ రావు, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్స్‌గా పోతురాజు, వెంకట సుభాష్‌, నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లీకేజీలకు మరమ్మతులు చేయించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ మహంకాళి నగర్‌ దగ్గర ఉన్న ఎల్లమ్మ చెరువులో పెద్ద పైపులు వేశారు. పాత పైపులు డ్యామేజీ కావడంతో లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీరు కాలనీలోకి రావడంతో ఇబ్బందికరంగా మారింది. దీంతో కంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ నర్సింగ్‌ యాదవ్‌ సమస్యను పరిష్కరించాలని అక్కడ విధులు నిర్వహిస్తున్న హైడ్రా అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు యాదవ్‌, వెంకటస్వామి రెడ్డి, రాయల్‌, సురేష్‌, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధి శంషీగూడ దర్గాలో గౌస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పీర్ల పండుగకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు అందరూ రంజాన్‌, బక్రీద్‌ తరువాత ముఖ్యమైన పండుగల్లో మొహర్రం ఒకటి అని అన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌ గౌడ్‌, ఇమ్రాన్‌, పద్మారావు, సుబాబా, కల్యాణ్‌, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న విష జ్వరాలు



- చెరువుల్లో పేరుకుపోతున్న గుర్రపుడెక్క
- దోమల నివారణకు చర్యలు తీసుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

మురికి వాడల్లో కనిపించని వైద్య శిబిరాలు



కూకట్‌పల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కూకట్‌పల్లి:

కూకట్‌పల్లి నియోజకవర్గంలో జ్వర బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వందల సంఖ్యలో ప్రజలు వస్తుండగా, బస్తీ దవాఖానాలకు సైతం భారీగా రోగులు వస్తున్నారు. జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. నాలా పరీవాహక ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన కూకట్‌పల్లి నియోజకవర్గంలో 9 చెరువులు, 18 కిలోమీటర్ల మేర నాలాలు ఉన్నాయి. చెరువులలో గుర్రపుడెక్కతో పాటు డ్రైనేజీ నీరు చేరటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు 100 కాలనీలు, బస్తీలు నాలాల చుట్టు పక్కల ఉండటంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఈ విషయంపై ప్రజలు, నాయకులు, బస్తీ వెల్ఫేర్‌ సంఘాల వారు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలైన కూకట్‌పల్లి, పరికి చెరువు, కేపీహెచ్‌బీ నాలా, ఫాక్స్‌ సాగర్‌ నాలాలో వ్యర్థ రసాయనాలు కూడా వదులుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కేపీహెచ్‌బీ మురుగు ఐడియల్‌ రంగధాముని చెరువులోకి నేరుగా చేరుతుండటంతో సమీపంలో ఉన్న బాలాజీ నగర్‌, వివేక్‌నగర్‌ల వద్ద ముక్కుమూసుకుని పోవాల్సిందే. భరించలేని దుర్వాసన వెలువడుతోంది. ఇక దోమల బెడద తీవ్రమైంది. తాజాగా కూకట్‌పల్లి, వివేక్‌నగర్‌లో రెండు డెంగీ కేసులు వచ్చాయని తెలిసింది. జీహెచ్‌యంసీ శానిటేషన్‌ అధికారులు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి.

బాలాజీనగర్‌లో.. డెంగీ!

కూకట్‌పల్లి ప్రాంతంలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. శుక్రవారమే బాలాజీనగర్‌లో డెంగీ కేసు వచ్చినట్లు తెలిసింది. సిబ్బందిని అక్కడికి పంపిస్తే సరైన ఆచూకీ లభించలేదు. జ్వర సర్వే కూడా ఇప్పటి వరకు చేపట్టలేదు. త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. దోమల నివారణపై జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచనలు చేస్తాం.

– మమత, వైద్యాధికారిణి

సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌ నగర్‌లో శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతాలను పర్యటించారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్‌, పోశెట్టి గౌడ్‌, ఇద్దయ్య, లక్ష్మణ్‌, సందీప్‌, శంషాద్‌, వెంకటేష్‌, హరి శంకర్‌, నిరంజన్‌, రమేష్‌, శ్రీను, ఏఐ శ్రావణి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్మార్ట్‌ లివింగ్‌ కార్యక్రమం



కార్పొరేటర్‌కు మొక్కను అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ నిజాంపేట్‌ రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్‌లో గ్రీన్‌ఇండియా మిషన్‌లో భాగంగా స్మార్ట్‌ లివింగ్‌ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంచడం ద్వారా భవిష్యత్‌ తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, పర్యావరణ సంరక్షణ పట్ల అవగాహన పెంచుకున్నారు. గ్రీన్‌ ఇండియా మిషన్‌ లక్ష్యాలైన అటవీ సంరక్షణ, జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను సాధించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్‌ ఏజీఎం శ్రీనివాస్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ సింధూష, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని 400 హాస్టళ్లకు నోటీసులు



హాస్టల్స్‌కు నోటీసులు ఇచ్చిన జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్‌ అధికారులు

కూకట్‌పల్లి: నిబంధనలు పాటించని హాస్టళ్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. మూసాపేట సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు మూసివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌ యజమానులతో సంబంధం లేకుండా హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు అధికారులను వేడుకోవటంతో రెండు రోజుల గడువు ఇచ్చారు. అదే విధంగా కేపీహెచ్‌బీ కాలనీలో సుమారు 400 హాస్టల్స్‌కు మొదటి నోటీసులు అందజేశారు. బాలాజీనగర్‌లో ఆర్‌జీవీ ఉమెన్స్‌ హాస్టల్‌ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నందున ఇప్పటికే మూడు నోటీసులు అందజేశారు. శనివారం క్లోజర్‌ నోటీస్‌ అందజేసి రెండు రోజుల్లో హాస్టల్‌ను మూసివేయాల్సిందిగా జీహెచ్‌ఎంసీ అధికారులు ఆదేశించారు. అదే విధంగా రోడ్డు నెంబర్‌ 1లోని ఎంఐజీ 77లో నిర్వహించే మరో హాస్టల్‌ను కూడా మూసివేశారు. ఈ విధంగా ఆహారంలో నాణ్యత లేకపోవటం, ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజు చెల్లించకపోవటం, నియమ నిబంధనలు పాటించకపోవటంతో అధికారులు నోటీసులు అందజేశారు. ఇటీవల కాలంలో ప్రజావాణిలో హాస్టల్స్‌పై ఫిర్యాదులు రావటంతో పూర్తి స్థాయిలో అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు.

10 నుంచి గురుపౌర్ణమి వేడుకలు

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ పాండురంగనగర్‌లోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 10 నుంచి గురు పౌర్ణమి వేడకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ బాకారం బుచ్చయ్య, కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్‌ అన్నారు. శనివారం ఆలయ ఆవరణలో పాలక కమిటీ, అర్చకులతో గురు పౌర్ణమి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10న కాగడ హారతి, పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, సామూహిక సాయి సత్య వ్రతం, అన్నదానం, సంధ్యా హారతి, భజన, పల్లకీ సేవ, సేజ్‌ హారతి, పవళింపు సేవ వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు అనూపమ, జై నర్సింహ, జి. రామకృష్ణరావు, డి. జనార్ధన్‌ గౌడ్‌, అర్జున్‌ రెడ్డి, ఏ. నాగేశ్వరరావు, అనిల్‌ కుమార్‌, ఆచార్యులు, అర్చకులు లక్ష్మణ శాస్త్రి, వెంకట్‌ ఆచార్యులు, సిబ్బంది రాజు, సర్వేష్‌, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



ఇన్‌స్పెక్టర్‌ వెంకట సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్‌ రాజేష్‌

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ నూతన ఇన్‌స్పెక్టర్‌గా వెంకట సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్‌ ఈఓడబ్ల్యూ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టగా.. కూకట్‌పల్లిలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ రాజేష్‌ రాజేంద్రనగర్‌ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా మూసాపేట సెక్టార్‌కు సబ్‌ ఇన్‌స్పెక్టర్‌గా గిరీష్‌ కుమార్‌, మరో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌ వివేకానందనగర్‌ సెక్టార్‌కు బదిలీపై వచ్చారు. శాంతిభద్రదల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం



హన్మంతరావు (ఫైల్‌)

మియాపూర్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాని సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హన్మంతరావు(57) నివాసముంటున్నాడు. మియాపూర్‌ కల్వరి టెంపుల్‌ సమీపంలో టైలరింగ్‌ షాపు నిర్వహిస్తున్నాడు. ఏప్రిల్‌ 3వ తేదీ ఉదయం హన్మంతరావు 8 గంటల సమయంలో టైలరింగ్‌ షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రి 11 గంటలు అయినా హన్మంతరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. ఏప్రిల్‌ 7వ తేదీ హన్మంతరావు వాట్సప్‌లో విజయవాడలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు మెసేజ్‌ పంపించాడు. ఈ క్రమంలో జూన్‌ 4వ తేదీ వరకు కుటుంబ సభ్యులతో వాట్సప్‌లో మాట్లాడుతూ ఉన్నాడు. ఆ తర్వాత నుంచి మాట్లాడకపోవడంతో ఆందోళన చెంది మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజు రూ.4.31 లక్షలు వసూలు



ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజు వసూలు చేస్తున్న శేరిలింగంపల్లి సర్కిల్‌ అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజులు వసూలు చేసేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. ప్రాపర్టీ ట్యాక్స్‌ వసూలు చేసే ఉద్యోగులకే ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజు బాధ్యతలు అప్పగించారు. రెండు రోజులుగా శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని 60 ట్రేడ్‌ లైసెన్స్‌ల ద్వారా రూ.4.31 లక్షలు వసూలు అయినట్లు డిప్యూటీ కమిషనర్‌ వి.ప్రశాంతి శనివారం తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్‌ వసూలు చేసే సిబ్బందికే వ్యాపారులు ట్రేడ్‌ ఫీజులు కూడా చెల్లించవచ్చన్నారు. ప్రతి వ్యాపారి జీహెచ్‌ఎంసీ నుంచి ట్రేడ్‌ లైసెన్స్‌ను తీసుకోవడంతో పాటు సకాలంలో ఫీజులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

చందానగర్‌: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌ కోడ్లను రద్దు చేయాలంటూ జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పరమేష్‌ పేర్కొన్నారు. చందానగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు 42 హక్కులను రద్దుచేసి వాటి స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్‌ కోడ్లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందీశ్వర, సుబ్బు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కూకట్‌పల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందీశ్వర, సుబ్బు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శనివారం కూకట్‌పల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికై 18 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జేఎన్‌టీయూహెచ్‌ వేదికగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన కనిపించలేదన్నారు. ప్రైవేట్‌ ఇంజినీరింగ్‌, డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్‌లు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఫీజులతో సంబంధం లేకుండా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మహేందర్‌, ఆనంద్‌, కరుణాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్‌ సబిహా బేగంకు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

మోతీనగర్‌: సమస్యలు పరిష్కరించాలని ఆర్‌కే సొసైటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్‌ సబిహాబేగంకు శనివారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్‌లో మౌలిక వసతుల కల్పన, సుమారు 500 మీటర్ల ఏబీ కేబుల్‌ ఏర్పాటుకు విజ్ఞప్తి చేశారు. షైనింగ్‌ సీడ్స్‌ స్కూల్‌ ఎదురుగా చెత్తను పడేస్తుండటంతో స్థానికులు, విద్యార్థులు తీవ్రమైన దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్‌ సుభాన్‌, జనరల్‌ సెక్రటరీ నర్సింహులు, బంగారు, సాంబయ్య, అమీర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

– ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: విద్యార్థులకు ప్రజాస్వామ్యం, దాని విలువలపై అవగాహన ఉండాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి శాంతినగర్‌లో శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు స్కూల్‌ క్యాబినెట్‌ ఎలక్షన్‌ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానమే : ఎమ్మెల్యే గాంధీ



శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్‌: రక్తదానం ప్రాణదానమేనని చిన్నారుల జీవితాలలో వెలుగులు నింపడానికి రక్తదాతలు అవ్వాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో ఇంటర్నేషనల్‌ వైశ్య ఫెడరేషన్‌ 12వ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఈ శిబిరానికి ఇంటరేనషనల్‌ వైశ్య ఫెడరేషన్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు పబ్బ మల్లేశం గుప్తా, ముఖ్యఅతిథులుగా టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌ గుప్త, కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రస్తుతం బ్లడ్‌ బ్యాంకుల్లో రక్తం తగ్గిపోతుండడంతో తలసేమియా, ఇతరత్రా వ్యాధిగ్రస్తులకు రక్తం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ అశోక్‌గౌడ్‌, రఘునాథ్‌రెడ్డి, నరేందర్‌ బల్లా, గంప సత్యనారాయణ గుప్త, దారం లక్ష్మయ్య గుప్త, చిన్న సత్యనారాయణ, కట్ట రవి గుప్త, వెంకటేష్‌ గుప్త, శ్రీనివాస్‌ గుప్త, మురళీ గుప్త, జయకృష్ణ గుప్త, భాస్కర్‌, కోటేశ్వరరావు, బండారి హాస్పటల్స్‌, డాక్టర్‌ సుశ్రుత, రాహుల్‌, డాక్టర్‌ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం జాగ్రత్తలు పాటించాలి

హెచ్‌సీయూ హెల్త్‌ సెంటర్‌ సీఎంఓ డా.రవీంద్రకుమార్‌



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌సీయూ హెల్త్‌సెంటర్‌ సీఎంఓ డాక్టర్‌ రవీంద్రప్రసాద్‌

గచ్చిబౌలి: వర్షాకాలం వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని హెచ్‌సీయూ హెల్త్‌ సెంటర్‌ సీఎంఓ డాక్టర్‌ రవీంద్రకుమార్‌ సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి నివారణచర్యలపై ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని శేరిలింగంపల్లి డివిజన్‌లో లహరి ఎస్టేట్‌ వద్ద ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం అతిసార, డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తను అనుకున్నది సాధించాలంటే సంపూర్ణ ఆరోగ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడడానికి ఆహారం, తాగు నీరు, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత వంటివాటిపై నిత్యం దృష్టి పెట్టాలని వివరించారు. నిత్యం యోగా, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్‌, తాజా ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అలాగే పీచు పదార్థాలు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు మారబోయిన సదానందయాదవ్‌, సభ్యులు జీవిరావు, శివరామకృష్ణ, అమ్మయ్యచౌదరి, ప్రేమ్‌సింగ్‌, వాణిసాంబశివరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నాటక ప్రదర్శన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెరిడీయన్‌ స్కూల్‌లో శనివారం ఆరోగ్యం, మొక్కల పెంపకం, రోడ్డు సేఫ్టీ తదితర సామాజిక అంశాలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రన్‌ నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రులు జుంబా డ్యాన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం రోడ్డు సేఫ్టీపై విద్యార్థులు వేసిన నాటకం ఆకట్టుకుంది. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.



రోడ్డు సేఫ్టీపై నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు